# సత్యవాక్యము

# THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్య వాణి' యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలుపొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులభముగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA_533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవుసరం!!

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

క్రైస్తవ మాసపత్రిక

పోస్ట్ బాక్స్ - 80, కాకినాడ - 533 001

ఎడిటర్ : జె. సి. ఛోట్

మేనేజింగ్ ఎడిటర్ : జాషువా గూటం

సంచిక 4 నవంబరు 1984 సంపుటి 5

## సంపాదకీయము

### క్రైస్తవ గృహము

### *( The Christian Home )*

ప్రపంచంలో అతి పురాతన సంస్థ గృహము. అది ఆదిలో దేవునిచే ఆరంభించబడింది. మానవుడు ఒంటరిగా యుండుట మంచిది కాదని యెరిగి దేవుడు అతనికి సహాయంగా యుండుటకు స్త్రీని సృజించాడు. వారు అభివృద్ధి పొంది భూమిని నిండించాలని దేవుడు వారికి చెప్పాడు (ఆది 2:18-25; 1:26-28).

ఈ లోకంలో క్రైస్తవ గృహాలు కానివే ఎక్కువ ఉన్నాయి. అయితే తలిదండ్రులు, వయస్సు వచ్చిన బిడ్డలు క్రైస్తవులైతే ఆ గృహం ఆదర్శ గృహం అవుతాది.

క్రైస్తవ గృహంలో, క్రీస్తు ఆ కుటుంబానికి శిరస్సైయుంటాడు. కుటుంబంలో యున్న ప్రతి సభ్యునికి ఆయన మార్గదర్శి, ఆయనే నాయకుడు. ఆయన గౌరవించబడతాడు, ఘనపరచబడతాడు. చెప్పబోనే మాటలలోను, చేసే చేష్టలన్నిటిలోను ఆయన ప్రభావం కనబడతాది. వారు దేవుని కుటుంబమైన క్రీస్తు సంఘ సభ్యులు గనుక

ప్రతి ఆదివారం ప్రభుని ఆరాధిస్తారు. ప్రతిరోజు క్రైస్తవ్యాన్ని జీవిస్తారు. వారొకరినొకరు ప్రేమిస్తారు, నిష్కపటులు, కష్టపడి పని చేస్తారు. ఆ కుటుంబ సభ్యులు ప్రథమశ్రేణి పౌరులు. వారి గ్రామంలో లేక ప్రాంతంలో యున్నవారు, వారి పొరుగువారు వారిని గౌరవిస్తారు.

క్రైస్తవ కుటుంబములో భర్త లేక తండ్రి యజమాని (ఎఫెసీ 5:23). అతడు తన భార్యను పిల్లలను ప్రేమిస్తాడు (ఎఫెసీ 5:25-33). అతడు ఆత్మీయ నాయకత్వాన్ని, క్రమశిక్షణను సభ్యులకు అందిస్తాడు (ఎఫెసీ 6:4). కుటుంబములో యున్న ప్రతివాని అవసరములు తీర్చడానికి ఆహారము, వస్త్రములు, వసతి, ఔషధాలు, విద్య మొదలగునవి యివ్వడానికి అతడు కష్టపడి పనిచేస్తాడు (1 తిమో 5:8). దీనికి బదులుగా అతడు గౌరవించబడాలి, విధేయత చూపించబడాలి, కుటుంబముయొక్క శిరస్సుగా గుర్తించబడాలి.

భార్య లేక తల్లి బలహీన ఘటము (1 పేతురు 3:7). ఆమె తన భర్తను బిడ్డలను ప్రేమించాలి (తీతు 2:4). తన భర్త ఆమెకు శిరస్సని గుర్తించి ప్రతి మంచి విషయములోను ఆమె అతనికి లోబడాలి (ఎఫెసీ 5 : 22, 23; కొలస్స 3 : 18; 1 పేతురు 3 : 1-5). ఆమె యింటిని చక్కబెట్టి బిడ్డలను చూచుకుంటూ యుండాలి (1 తిమో 5:14).

పిల్లలు తమ తలిదండ్రులను ప్రేమించాలి, ఘనపరచి వారికి లోబడాలి. అట్లు చేయుటవలన వారు దీర్ఘాయుష్మంతులౌతారు (కొలస్స 3:20; ఎఫెసీ 6:1-3).

ఒక కుటుంబము క్రైస్తవ కుటుంబమైతే భార్యాభర్తలు ఒండొరులకు నమ్మకంగా యుంటారు. కుటుంబములోని ప్రతివారు తమతమ బాధ్యతలను నిర్వర్తిస్తూ యుంటే అదే పరలోకానుభూతి అవుతుంది. అట్టి గృహంలో యున్న శాంతి సమాధానములు, సంతోషము వేరే మార్గంలో కానరావు. యిట్టి గృహాల అవసరత ఎంతైనా యున్నది.

అయితే అనేక గృహాలు దీనికి వ్యతిరేకంగా యున్నాయని చెప్పకోవలసివస్తుంది. అది విచారకరం. ప్రపంచంలోని కొన్ని ప్రదేశాలలో వివాహం హేళన చేయబడుచున్నది. వివాహానికి వేరుగా పిల్లలు కలుగుచున్నారు. కుటుంబమే దాని ఉనికి కొరకు శ్రమపడాల్సివస్తుంది.

క్రీస్తులేని గృహాలు తినడానికి పండుకోడానికి కుటుంబ సభ్యులు వచ్చే ఒక స్థలం మాత్రమే. దానిలోని సభ్యులకు సరితూగేది యేదీ ఉండదు. ఒకరినొకరు నిజంగా ప్రేమించే వారుండరు. ఇట్టి పరిస్థితులలో వారు ఎంతకాలం జీవించగలరు?

పైన చూచుకొన్న సందర్భాన్నిబట్టి యే గృహాన్ని నీవు కోరుకొంటావు? అన్నిటికంటే క్రైస్తవ గృహామే శ్రేష్ఠమైనదని నీవు ఒప్పుకొంటావని నేననుకొనుచున్నాను. నీ కట్టి గృహం లేకపోతే అట్టిదానిని నెలకొల్పే రోజుకొరకు ప్రయత్నించుము. క్రైస్తవుడవగుట ద్వారా నీవు ఆరంభించవచ్చును. నీవు క్రైస్తవుడవైతే, వివాహితుడవైతే నీ భార్యకూడ క్రీస్తు ననుసరించునట్లు ప్రోత్సహించుము. నీవు వివాహితుడవు కానియెడల ఒక క్రైస్తవ స్త్రీని పెండ్లి చేసికోవచ్చును, లేదా నీవు పెండ్లి చేసికోబోయే ఆమెను క్రీస్తుకొరకు మార్చవచ్చును. తరువాత మీకు బిడ్డలు కలుగుచుండగా నీ కుటుంబ సభ్యులకు క్రీస్తు బోధనలు బోధింపవలెను. తత్ఫలితముగా నీది క్రైస్తవ గృహం కాగలదు.

సత్ క్రైస్తవ కుటుంబాలు వాటియొక్క ప్రభావము లేనియెడల ఈ రోజు నీవెక్కడ యుందువు? అవి లేకుండా ఈ లోకం చాల పాడైపోతాది. నిజానికి అవి లేకుండా ఈ లోకం ఎట్లు మన్నగలుగు తాది? అది మన్న లేదని నా విశ్వాసం.

నీవొక గృహాన్ని కలిగియుండు. అయితే కేవలం జీవించడానికి అదొక యిల్లుగా కాకుండ మంచి గృహాన్ని, క్రైస్తవ గృహాన్ని కలిగి యుండు. ప్రభువు నీకు సహాయం చేయునుగాక!

# నేను నమ్ముచున్నాను
## (నాకు అవనమ్మకముండకుండ సహాయము చేయుము)
## *I Believe (Help Thou Mine Unbelief)*

—జె. సి. బెయిలీ

నేను 1963 లో మొదట భారతదేశం వచ్చినప్పటినుండీ, కెనడా దేశీయులు వీసా కలిగి యుండాలని ఇండియా ప్రభుత్వం అడుగలేదు. గాని ఇప్పుడది అవుసరమని వారు చెబుతున్నారు. నేను వీసాకొరకు అర్జీ దాఖలుచేసాను. దాన్ని నేను పొందుతానో లేదో ఇంకా నాకు తెలీదు. నేను ఇండియాకు వచ్చే ప్రయాణాలు బహుశా ముగిసి యుండవచ్చు. ఈ భారమైన తలంపులతో ఈ వ్యాసం వ్రాయడానికి నేను ప్రోత్సహించబడ్డాను. అయితే నేను ఇండియాకు వచ్చినా, రాక పోయినా ఇందులో ఉన్న అంశము అతి ప్రాముఖ్యమైనది.

## విశ్వాసమే మూలం

మన విశ్వాసాన్నిబట్టి దేవుడు మనల్ని అంగీకరిస్తాడు. అపవిత్రాత్మచే బాధింపబడుచున్న యొక చిన్నవాని తండ్రి యేసునొద్దకు వచ్చాడు. అతడా కుమారుని ముందు ఆయన శిష్యుల యొద్దకు తీసి కొనివెళ్ళాడు గాని వారాదయ్యాన్ని వెళ్ళగొట్టలేకపోయారు. "ఏమైనను నీవలన నైతే మామీద కనికరపడి మాకు సహాయము చేయుమని" అతడు యేసును వేడుకొన్నాడు (మార్కు 9:22). "అందుకు యేసు- నమ్ముట నీవలన నైతే నమ్మువానికి సమస్తమును సాధ్యమే యని అతనితో చెప్పెను" (మార్కు 9:23). ఇండియాలోని క్రీస్తుసంఘము యొక్క ప్రతిసభ్యునికి యిది నావర్తమానమై యున్నది. మనముందొక గొప్ప పని యున్నది. భారతదేశ ప్రజలకు సువార్త నందియ్యడమే ఆ పని. అమెరికాదేశపు డబ్బు ఎంత ఉన్నది అనేదానిపై మనవిజయం ఆధారపడియుండదుగాని, మనకెంత విశ్వాసమున్నదో యను దానిపై

ఆధారపడి యుంటాది. యేసుయొక్క సహాయాన్ని కోరుచు ఆయన యొద్దకు వచ్చినవానివలె యుండముగాక. అతడు నమ్మినట్లయితే సహాయం దొరుకుతుందని యేసు చెప్పాడు. "నేను నమ్ముచున్నాను, నాకు అపనమ్మకముండకుండ సహాయము చేయుమని" ఆ చిన్నవాని తండ్రి చెప్పిన మాటలను వినండి (మార్కు 9:24). భారతదేశ ప్రజలకు మనం సువార్త అందివ్వాలి. దీనిలో ఏవిధమైన జాప్యం జరుగకూడదు. ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయం. ఇదిగో ఇదే రక్షణదినము (2 కొరింథీ 6:2). సర్వసృష్టికి సువార్త బోధింపబడాలి (మార్కు 16:15). మనం నమ్మినయెడల మాట్లాడుదుము. "కాగా విశ్వసించితిని గనుక మాటలాడితిని అని వ్రాయబడిన ప్రకారము అట్టి విశ్వాసముతో కూడిన ఆత్మగలవారమై... మేమును విశ్వసించుచున్నాము గనుక మాటలాడుచున్నాము" (2 కొరింథీ 4:13-15). నమ్మినవానికి సమస్తము సాధ్యమే యని ప్రభువు చెప్పాడు. ప్రభువు మనకు చేసిన కొన్ని వాగ్దానముల నిప్పుడు చూద్దాం: "ధనాపేక్షలేనివారై మీకు కలిగిన వాటితో తృప్తి పొంది యుండుడి. నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను అని ఆయనయే చెప్పెనుగదా. కాబట్టి ప్రభువు నాకు సహాయుడు; నేను భయపడను, నరమాత్రుడు నాకేమి చేయగలడు?" (హెబ్రీ 13:5, 6). "నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలను". "నాకు కొదువ కలిగినందున నేనీలాగు చెప్పుటలేదు; నేనేస్థితిలో ఉన్నను ఆ స్థితిలో సంతృప్తి కలిగియుండ నేర్చుకొని యున్నాను". "కాగా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తు యేసునందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును" (ఫిలిప్పీ 4:13, 11, 19). ఈ వచనాలు చదువునప్పుడు ప్రభువా నాకు అపనమ్మకము కలుగకుండ సహాయం చేయుమని మనం తప్పక అరవాలి.

## మనలో పని చేయు శక్తి

పునాదిమీద కట్టబడినవారై స్థిరముగా ఉండి, మీరు విన్న

ట్టియు ఆకాశము క్రిందనున్న సమస్త సృష్టికి ప్రకటింపబడినట్టియు ఈ సువార్తవలన కలుగు నిరీక్షణనుండి తొలగిపోక, విశ్వాసమందు నిలిచియుండినయెడల ఇది మీకు కలుగును" (కొల 1:23). మనం విశ్వాసమందు నిలిచియున్నామా? స్థిరముగా యున్నామా? అయితే తరువాతి వచనం చదువుదాం: "ఇప్పుడు మీకొరకు నేను అనుభవించుచున్న శ్రమయందు సంతోషించుచు, సంఘమను ఆయన శరీరము కొరకు క్రీస్తుపడిన పాట్లలో కొదువైన వాటియందు నా వంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను" (24 వ). ఇప్పుడు ఎఫెసీ 3:20, 21 చదువుదాం: "మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగువాటన్నిటి కంటెను, ఊహించువాటన్నిటి కంటెను అత్యధికముగా చేయ శక్తిగల దేవునికి క్రీస్తుయేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగుగాక. ఆమేన్". మనలో పనిచేయు శక్తి యేది? అది సువార్త యందలి మన విశ్వాసమే. "సువార్తనుగూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి...రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది" (రోమా 1:16). బైబిలులో మనం బాగా ఎరిగిన ఇంకో వాక్యభాగం ఉన్నది. అయితే నిజంగా మనం దానియందు విశ్వాసముంచుచున్నామా?: "యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు. పచ్చికగల చోట్లను ఆయన నన్ను పరుండజేయుచున్నాడు. శాంతికరమైన జలములయొద్ద నన్ను నడిపించుచున్నాడు. నా ప్రాణమునకు ఆయన సేద దీర్చుచున్నాడు. తన నామమునుబట్టి నీతి మార్గములలో నన్ను నడిపించుచున్నాడు. గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను. నీవు నాకు తోడై యుందువు. నీ దుడ్డుకర్రయు నీ దండమును నన్ను ఆదరించును. నా శత్రువుల యెదుట నీవు నాకు భోజనము సిద్ధపరచుదువు. నూనెతో నా తల అంటి యున్నావు. నా గిన్నె నిండి పొర్లుచున్నది.

నేను బ్రతుకు దినము లన్నియు కృపాక్షేమములే నా వెంట వచ్చును. "చిర కాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను" (దా. కీర్తన 23).

మనము ఏలాగు విశ్వసించుచున్నాము? "క్షణమాత్రముండు మా చులకని శ్రమ మాకొరకు అంతకంతకు ఎక్కువగా నిత్యమైన మహిమ భారమును కలుగజేయుచున్నది" (2 కొరింథీ 4:18), "దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పముచొప్పున పిలువబడిన వారికి మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవి" (రోమా 8:28). "అయినను మనలను ప్రేమించిన వానిద్వారా మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము. మరణమైనను జీవమైనను దేవదూతలైనను ప్రధానులైనను ఉన్నవియైనను రాబోవునవియైనను అధికారులైనను ఎత్తయినను లోతైనను సృష్టింపబడిన మరి ఏదైనను మన ప్రభువైన క్రీస్తు యేసునందలి దేవుని ప్రేమనుండి మనలను ఎడబాపనేరవని రూఢిగా నమ్ముచున్నాను" (రోమా 8 : 38-39).

## బలహీనత క్రీస్తులో బలము

మన బలహీనత క్రీస్తులో బలము కాగలదు. "అది నా యొద్ద నుండి తొలగిపోవలెనని దాని విషయమై ముమ్మారు ప్రభువును వేడుకొంటిని. అందుకు, నా కృప నీకు చాలును, బలహీనతయందు నాశక్తి పరిపూర్ణమగుచున్నదని ఆయన నాతో చెప్పెను. కాగా క్రీస్తు శక్తి నామీద నిలిచియుండు నిమిత్తము విశేషముగా నా బలహీనతలయందే బహు సంతోషముగా అతిశయపడుదును" (2 కొరింథీ 12:8-9).

మనం ఇంకా ముందుకు సాగిపోదము: "కాగా విశ్వాసమూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసు క్రీస్తుద్వారా దేవునితో సమాధానము కలిగియుందము. మరియు ఆయన ద్వారా మనము విశ్వాసము వలన ఈ కృపయందు ప్రవేశము గల

వారమై అందులో నిలిచియుండి, దేవుని మహిమను గూర్చిన నిరీ
ణనుబట్టి అతిశయ పడుచున్నాము" (రోమా 5:1, 2). పరిశుద్ధాత్మ
డిట్లు చెప్పుచున్నాడు, వినండి: "కాగా మేమాయన తోడి పని
రమై మీరు పొందిన దేవుని కృపను వ్యర్ధము చేసికొనవద్దని మిమ్మ
వేడుకొనుచున్నాము" (2 కొరింథీ 6:1). మీరు నమ్మని యెడ
దేవుని కృపను వ్యర్ధముచేసిన వారగుదురు. విశ్వసించువాడు నిత్య
జీవము గలవాడు. విధేయుడు కానివాడు జీవము చూడడుగాని దేవు
ఉగ్రత వానిమీద నిలిచి యుండును (యోహాను 3:36). దేవు
వాగ్దానముల యందు మనకెంత విశ్వాసమున్నది? "ఇయ్యుడి అప్పు
మీకియ్యబడును; అణచి, కుదిలించి దిగజారునట్లు నిండుకొలతను మ
ష్యులు మీ ఒడిలో కొలుతురు. మీరు ఏ కొలతతో కొలుతురో
కొలతతోనే మీకు మరల కొలువబడును" (లూకా 6:38).

## దే వు డి చ్చిం ది

దేవుడు తన కుమారుని యిచ్చినప్పుడు మనకు ఎంతో
యిచ్చాడు. "చెప్పశక్యముకాని ఆయన వరమును గూర్చి దేవు
స్తోత్రము" అని పరిశుద్ధాత్ముడు చెప్పాడు (2 కొరింథీ 9:15). సిలువపై
చనిపోవుటకు తన కుమారుని యివ్వడమే దేవుడిచ్చిన గొప్పవరము.
గొప్ప వాస్తవమే సువార్త (1 కొరింథీ 15 : 1-4). నమ్మువా
రక్షించడానికి దానిలో శక్తి యున్నది (రోమా 1 : 16). మన
నమ్మితే దాన్ని యితరులకు చెబుతాం (రోమా 10:9, 10). మన
విశ్వాసమూలమున మాత్రమేగాక విధేయత మూలమున నీతిమం
లముగా తీర్చబడుదుము. "కాగా నా ప్రియులారా, మీ రెల్లప్పుడు
విధేయులై యున్న ప్రకారము, నా యెదుట ఉన్నప్పుడు మాత్ర
గాక మరి యెక్కువగా నేను మీతో లేని యీ కాలమందును భయ
తోను వణకుతోను మీ స్వంత రక్షణను కొనసాగించుకొనుడి" (ఫిలి
2:12). "ఆయన...తనకు విధేయులైన వారి కందరికిని నిత్యరక్షణ

కారకుడాయెను" (హెబ్రీ 5 : 9, 10). ప్రభువు వచ్చినప్పుడు ఇది జరుగును: "ఇదిగో, త్వరగా వచ్చుచున్నాను. వాని వాని క్రియ చొప్పున ప్రతివాని కిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నా యొద్ద ఉన్నది" (ప్రక 22:12).

మనకున్నదంతా ప్రభువునుండే వచ్చును (అపొ.కా. 17:25-27). మీరు మీ సొత్తు కారు, విలువపెట్టి కొనబడినవారు అని మనకు చెప్పబడింది (1 కొరింథీ 6:20).

## మన కర్తవ్యము

మనం వాక్యము బోధించాలి (2 తిమో 4 : 1-2). మనము దేవుని సంకల్పాన్నంతటినీ బోధించాలి. లేనియెడల మనం దోషుల మగుదుము (అపొ. కా. 20:26, 27). ఈ తీవ్ర బాధ్యతయే గృహ నిర్వాహకత్వం అనబడింది. "దేవుని నానావిధమైన కృప విషయమై మంచి గృహ నిర్వాహకులై యుండి యొక్కొక్కడు కృపావరము పొందినకొలది యొకనికొకడు ఉపచారము చేయుడి" (1 పేతు 4:10) పెద్దలు దేవుని గృహనిర్వాహకుల వలె నిందారహితులుగా యుండాలి (తీతు 1:7). "మిక్కిలి కొంచెములో నమ్మకముగా ఉండువాడు ఎక్కువలో నమ్మకముగా ఉండును; మిక్కిలి కొంచెములో అన్యాయముగా యుండువాడు ఎక్కువలో అన్యాయముగా ఉండునని" యేసు చెప్పాడు (లూకా 16:10, 11). మనం దేవుని సంకల్పాన్నంతటినీ బోధించాలి. ఆయన పనిని జరిగించడానికి దేవుడు మన కిచ్చిన సాధనాలను వినియోగించాలి.

ఈ దిగువ వచనంలాంటి దాన్ని మనం చదివేసరికి, ప్రభువా! అపనమ్మకం కలుగకుండా నాకు సహాయం చేయుమని మనం అరవాలి: "మరియు అన్నిటియందు ఎల్లప్పుడును మీలో మీరు సర్వసమృద్ధి గలవారై ఉత్తమమైన ప్రతికార్యము చేయుటకు దేవుడు మీ యెడల సమస్త విధములైన కృపను విస్తరింప జేయగలడు".

"విత్తువానికి విత్తనమును తినుటకు ఆహారమును దయచేయు దేవుడు మీకు విత్తనము దయచేసి, విస్తరింపచేసి మీరు ప్రతి విషయములో పూర్ణౌదార్య భాగ్యము గలవారగునట్లు మీ నీతి ఫలములు వృద్ధి పొందించును" (2 కొరింథీ 9:8-11). మేము బీదవారమని సాకులు చెప్పి యిచ్చుటలో వెనుకాడరాదు. విశ్వాసముతో మనం దేవుని ఆజ్ఞకు విధేయులు కావాలి. నా అవిశ్వాసాన్ని తొలగించు ప్రభూ అని ప్రార్థించాలి.

మనం దేవుని సంకల్పాన్నంతటినీ బోధించాలి. దేవుని సంకల్పాన్నంతటినీ మనం ఆచరించాలి. ఈ వ్యాసంలోని సంగతులను మీరు వినిన యెడల అది మీకు మేలు.

---

## అసమానుడైన క్రీస్తు

చరిత్ర పురుషులలో యేసు సాటిలేనివాడు. అద్వితీయుడు, కృపా సత్యములు ఆయన భౌతిక శరీరములో లీనమై యున్నవని యోహాను పలికినాడు (యోహా 1 : 14). దేవునిలో గల శ్రేష్ఠ లక్షణముల సర్వ సంపూర్ణత శరీర రూపమున క్రీస్తులో నివసించి యున్నదనియు, మరియు అదృశ్య దేవుని యొక్క దృశ్య రూపము చూడవలెనన్న క్రీస్తులోనే చూడగలమనియు అపొస్తలుడైన పౌలు పలికెను (కొలొ 1:15, 18).

ఈ యేసు ఎవరు? సుమారు 2 వేల సంవత్సరముల క్రిందట పాలస్తీను దేశములో నివసించి పరోపకారియై జీవించి చనిపోయిన మహాత్ముడు అని చెప్పిన చాలునా? ఎంతమాత్రము చాలదు. ఆయనకు ఆయనే సాటి. ప్రపంచములో ఏవ్యక్తితోను ఆయనను పోల్చలేము. ఆయననుగూర్చి గ్రంథములో వ్రాయబడిన మాటలు, మరియు తన్నుగూర్చి తాను పలికిన మాటలు చూచినచో ఆయనను మరో

మానవునితో పోల్చవెఱతుము. ఆయన అద్వితీయుడు అని చెప్పుటకు గల కారణములు కొన్ని చూతము.

## సా టి లే ని జ న్మ

1. ఆయన ఈలోకములో జన్మించకముందే ఆయన ఉన్నాడు. ఆయన సుమారు 1984 సం॥ల క్రిందట జన్మించినాడని చెప్పెదము. అది ఆయన నరావతార మెత్తినరోజే. ఆదియందు వాక్యము ఉండెను. ఆవాక్యము దేవునియొద్ద నుండెను. ఆ వాక్యమే దేవుడై యుండెను. మరియు సమస్తము ఆ వాక్యమువలన సృష్టింపబడెను. లోకములో ఉన్నదంతయు ఆయన లేకుండా కలుగలేదు (యోహా 1:1-3). ఆయన తన్నుగూర్చి ఇట్లు చెప్పెను: “నేనే ఆదియు, అంతమును” ప్ర 1:18 ... ప్రవక్తలు ఆయన నరావతారి కాకముందు ఆయన అద్భుత జన్మమును గూర్చియు, ఆయన చేయబోవు పనిని గూర్చియు, మరియు పరోపకారార్థమై ఆయన ప్రాణమిడు రీతిని గూర్చియు ముందుగనే, అనగా కొన్ని వందలు ఏండ్లకు ముందే ప్రవచించిరి. ఆయన కన్యకు జన్మించెను. ఇది మానవ జ్ఞానమున కందని విషయముగాని దైవసంకల్పము. అందులకే యేసు సాటిలేనివాడని చెప్పెదము.

2. ఆయన పరిశుద్ధుడుగ జీవించెను. అనగ మనోవాక్కాయ కర్మలలో పాపము లేనివాడని భావము. మానవకోటిలో ప్రతివాడును పాపియే. మానవుడైన యేసు అన్నింటిలో మనవంటివాడే. మనవలె ఆకలి దప్పులు గలవాడు, బాధ అననేమో, లేమి అననేమో ఎరిగినవాడు. అయినను ఆయన పరిశుద్ధుడుగ జీవించెను. ‘పరిశుద్ధుడు’ అను పదము ఆయనకే చెల్లును—మానవులెవరికిని, ఎంత మంచివారికైనను ఈ పదము తగదు.

‘పవిత్రుడు నిష్కల్మషుడు, నిర్దోషి పాపులలో చేరక ప్రత్యేకముగ నున్నవాడు’—అను మాటలు ఆయనను గూర్చియే చెప్పబడెను (హెబ్రీ 7:26). నీతిదూరులై మత కర్మకాండకు బద్ధులైయున్న యూద మతాధికారు లాయన నెదిరించినపుడు, ‘నాలో పాపమున్నదని

మీలో ఎవరు ఋజువు చేయగలరు' అని సవాలు చేసినపుడు వారు మౌనులైరి (యోహా 8:45). "ఆయన పాపము చేయలేదు. ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు" (1 పేతు 2:22). యేసు పరిశుద్ధుడు, అందుచే అద్వితీయుడు అనుమాట ఆయన ఒక్కనికే చెందును.

## సాటిలేని మాటలు

a) మాటలాడుటలో ఆయన అసమానుడు, అద్వితీయుడు. ఆయన బోధ విన్నవారు చెప్పినదేమనగా—ఆయన వారి శాస్త్రులవలె కాక అధికారము గలవానివలె వారికి బోధించెను" (మత్త 7:29). ఆయన పరిశుద్ధుడు గనుక ఆయన మాటలు పరిశుద్ధమైనవి. అందుచే అధికారముతో కూడినవి—ఆయన వారి శాస్త్రుల బోధలతో తన బోధ పోల్చుకొనుచు 'అయితే నేను చెప్పినదేమనగా' అని చెప్పుటలో - అలాటి ఖండితమైన మాటలు చెప్పుటకు తానే అర్హుడనని మరెవరును చెప్ప సాహసించలేరని ఆయన భావము. మరియు ఆయన తన ఆధ్యాత్మిక సత్యములను బోధించుటలో వేషధారులను విమర్శింప వెనుదీయ లేదు.

b) మరియు ఆయన మాటలు, నీతిదూరుల మనస్సాక్షులను ఈటెతో పొడిచినట్లు బాధ కలిగింపగ వారు నోళ్ళు మూసుకొనిరి (యోహా 8:9 మార్జినులో).

c) ఆయన మాటలు దయా కనికరములతో నిండినవి గనుక, సాంఘిక దురన్యాయములచేతను, లేమిచేతను పీడింపబడినవారి హృదయములకు నెమ్మది నొసగినవి (లూకా 4:22). ఒకనాడాయనను పట్టి బంధించికొని పోవునట్లు దేవాలయ అధికారులు పోలీసులను పంపిరి. యేసు సమూహములకు బోధించుచుండుట వారు చూచి అలాగే నిలుచుండి ఆయన మాటలు ఆలకించుచుండిరి. కొంతసేపు గడిచిన తరువాత ఆ పోలీసులు వట్టిచేతులతో వెనుకకు పోయిరి. దేవాలయ అధికారులు "మీరెందుకు ఆయనను పట్టి తీసుకొనిరాలేదు" అని అడుగగా, వారు ఆయన మాటలాడినట్లు ఎవరును ఎన్నడును మాటలాడలేదని జవాబిచ్చిరి (యోహా 7:46).

## సాటిలేని కార్యములు

4. ఆయన కార్యములు సాటిలేనివి. అనగా మానవులెవరు చేయలేనివి. రోగుల నేలాటివారినైన ముట్టి, లేదా ఒక్క మాటలో సంపూర్ణ స్వస్థులుగ జేసెను. అంగవిహీనులను బాగుచేసెను. మృతులను సజీవులుగ జేసెను. గాలి తుఫాను, పొంగుచున్న సముద్ర జలమును నిమ్మళింప అజ్ఞాపించెను. సామాన్యమగు నీటిని, రుచిగల ద్రాక్ష రసముగ జేసెను. మానవులను పీడించు దయ్యములను వెడలగొట్టెను. ఆయన చేసిన అద్భుతములన్నియు వ్రాసి పెట్టుటకు వీలులేదు, అవి అపారములు అని అపొస్తలుడైన యోహాను పలికెను (యోహా 21:30). యేసు జరిగించిన అద్భుతములు చూచియో, లేక వినియో, ఆశ్చర్యముతో నిండినవాడైన యూద మత అధికారి ఆయన యొద్దకు వచ్చి, "గురువర్యా, నీవు పరలోకమునుండి మానవ లోకమున కరుదెంచితివని మేము గ్రహించు చున్నాము, కానిచో ఈలాటి గొప్ప కార్యములే మానవుడును చేయలేడని చెప్పెను" (యోహా 3:2).

5. మరియు ఆయన తనకుగల హక్కులనుగూర్చి చెప్పినపుడు మరే యితర మానవునితో ఆయన సాటికాడని తెలియుచున్నది. ఒకడు నేను డాక్టరును, మరియొకడు నేను ఇంజనేరును, మరొకడు నేను భూస్వామిని అని వెవ్వేరు విధములుగ తమ హక్కులు తెలియ జేతురు. యేసుయొక్క హక్కు లేలాటివి? ఆయన తన్ను గూర్చి ఏమని చెప్పుకొనెను?

నేను లోకమునకు వెలుగై యున్నాను (యోహా 8:12) నేనే మార్గమును, సత్యమును జీవమునై యున్నాను (యోహా 14:6). పాపాంధకారమును బాపు వెలుగు యేసే; పరలోకమునకు మార్గము ఆయనే; పాపము వలన చచ్చిన వారికి జీవము ఆయనే. యేసు పరలోకమునకు మార్గము చూపించువాడు మాత్రముకాదు. ఆయనే

మార్గము. సత్యమును బోధించువాడు మాత్రము కాదు, ఆయనే సత్యము. ఇవి ఎంతటి దివ్యమైన వాక్కులు! ఈలాటి వాక్కులుగల మానవులెవరు? ఇంతియే కాదు. ఐహికాహారమునకై ప్రాకులాడు వారికి, ఎన్నడును మరి ఆకలి నియ్యని "జీవాహారము" నేనే అనియు... వ్యర్థమైన లోకాశలకై తృష్ణ గలవారికి మరల దప్పిగొనని 'జీవజల' మొసగువాడు నేనే యనియు ఎలుగెత్తి చెప్పెను. ఇవి ఆయన వాక్కులు. సాటిలేనివి.

## సాటిలేని మరణ పునరుత్థానములు

6. ఆయన మరణము సాటిలేనిది. అలాటి మరణము నెవ్వరు అనుభవించలేదు. అనేకులు మరణమైరి యింకను మరణమగుచునే యున్నారు. అందుచే ఆయన అందరి వంటివాడు అని చెప్పగలమా! బలవంతముగా ఆయనను కొనిపోయి కొట్టి లేక కొరత వేసి చంపిరి అని చెప్పగలమా? బాహ్యమునకు అట్లే కాన్పించుచున్నది, గాని అది సంపూర్ణ సత్యము కాదు. ఆయనను బలవంతముగ వారు కొనిపోయినచో వారి నెదిరింప శక్తి ఆయనకు లేదా? ఆయన మరణమును గూర్చి ఆనాడు జరిగిన సంగతులు, మరియు ఆయన చెప్పినమాటలు మనము తెలిసికొన్నచో ఆయన నిజముగ ఎందుకు చావవలసివచ్చెనో మనకు విశదమగును.

'ఎవడును నా ప్రాణము తీయలేడు నాయంతట నేనే దానిని పెట్టుచున్నాను, దానిని పెట్టుటకు నాకు అధికారము గలదు. దానిని తిరిగి తీసుకొనుటకు నాకు అధికారముగలదు' (యోహా 10:18). ఎందుకాయన తన ప్రాణము పెట్టవలయును? 'మనుష్య కుమారుడు (యేసు) పరిచారము చేయించుకొనుటకు రాలేదుగాని, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము నిచ్చుటకు వచ్చెను" (మత్తై 20:23). ఈమాటల భావమేమి? ఆయన ప్రాణము పెట్టినదేగాని

పాపులకు, మానవులకు రక్షణ లేదని స్పష్టమగుచున్నది. ఈ తన ప్రాణమును తానే, తన యిష్టపూర్వకముగ నిచ్చుచున్నాడు.

గెత్సెమనే తోటలో సుమారు అర్ధరాత్రివేళ ఆయనను పట్టుకొనుటకు కర్రలతోను కత్తులతోను ఒక పెద్ద గుంపు వచ్చినది. వారి యెదుట యేసును ఆ శిష్యులలో కొందరును నిలుచుండిరి. పెద్దగుంపు నుండి ఒకడు ముందుకు వచ్చి ప్రేమతో ఆయనను ఆలింగనము చేసినట్లు నటించి యితడే యేసు అని గుంపులోని వారికి ఆనవాలు చెప్పెను. అయితే వారాయనను పట్టుకొనగలిగిరా? లేదు. యేసు తానే ఒక అడుగు ముందుకు వేసి "మీరెవరు కావలెను?" అని అడిగెను. వారు నజరేయుడైన యేసు కావాలి అని చెప్పిరి. అంతట యేసు, నేనే ఆయనను నన్ను కొనిపొండి, అని జవాబియ్య వారు వెనుకకు తగ్గి నేలపడిరి (యోహా 18:6). ఎందుకు పడియుందురు? ఆ విషయములో ఆయన ముఖము బహు తేజోవంతముగ ప్రకాశించనేమో. మండుచున్న ఆయన నేత్రముల నుండి ఆయన పరిశుద్ధత ప్రజ్వలించనేమో. ఏది ఎట్లున్నను వారు భయకంపితులై నేలకొరగిరి. ఎంత ఆశ్చర్యము. మరియు ఆ సమయమున ఆయన కెంత బలముగలదో ఆయనే చెప్పినాడు. తనకు కావలెనన్న పరము నుండి 12 వేల దూతల సైన్యము దిగి రాగలదని చెప్పినాడు. అయినను తన మరణము పాపుల రక్షణార్థమైన దైవచిత్తము అని చెప్పి తన్ను తాను వారి చేతుల కప్పగించుకొన్నాడు. ఆయనే తన యిష్టపూర్వకముగ తన్ను అప్పగించుకొననిచో ఆయనమీద చేయి వేయగలవారు లేరు కనుక ఆయన మరణము అద్వితీయమైనది, సాటిలేనిది.

7. యేసు మరణమైనాడు, సమాధి చేయబడినాడు. అక్కడితో ఆయన చరిత్ర అంతమైతే ఆయన నలుగురువంటివాడే అనవచ్చును; గాని అట్లు జరుగలేదు. మూడవదినమున, అనగా ఆదివారము తెల్లవారకముందే సజీవుడై లేచినాడు. మహాత్ములు అనబడినవారు

గలదు. వారు పుట్టిరి, చనిపోయిరి. అక్కడతో వారిచరిత్ర అంతమైనది. కాని యేసుప్రభు యొక్క అసలు చరిత్ర ఆయన పునరుత్థానుడైన నాటి నుండియే ప్రారంభమైనది. ఆయన ఏల పునరుత్థానుడు కాగలిగెను? "మరణము ఆయనను బంధించి యుండుట అసాధ్యము గనుక, దేవుడు మరణ వేదనలు నివారణచేసి ఆయనను లేపినాడు" అని వాక్యము చెప్పుచున్నది (అపొ.కా. 2:24). ఆయన పరిశుద్ధుడు గనుక మరణము ఆయన శరీరమును మన్నులో మాయము చేయలేకపోయెను (కార్య 2:27). ఆయన మరణమువలన మన పాపములకు ప్రాయశ్చిత్తము కలిగినది. ఆయన పునరుత్థానమువలన మనము దేవునియెదుట నిందారహితులముగ నిలువబడ గలుగునట్లు వీలు కలిగెను (రోమా 4 : 24).

మరియు ఆయన పునరుత్థానమువలన మరణమును గెల్చి దానిని ఖైదిగ జేసెను (ప్రక 1:18); ఆయనను విశ్వసించిన వారికి మరణము వలన భయములేకుండా జేసెను (1 కొరి 15:54-57). ఆయన పునరుత్థానము నొందినరీతినే, ఆయన యందు విశ్వసించువారు కూడ మహిమ దేహము ధరించి లేతురు అను నిరీక్షణ కలుగజేసెను (1 కొరి 15 : 53). మరియు అట్టివారు పాపమునకును ఇహలోక బాధలకును దూరము చేయబడి శాశ్వత రాజ్యమున ప్రవేశించి దేవునితోను దూత సమూహములతోను తమవలెనే విమోచింపబడిన కోట్ల కొలదిగాగల పరిశుద్ధులతోను నిత్య సహవాసానందములను భవింతురు.

చదువరీ: యేసు సాటిలేనివాడని, అసమానుడని నీవు గ్రహించితివా?

ఆయనజన్మ సాటిలేనిది, ఆయన జీవితము, ఆయన మాటలు, ఆయన పనులు, ఆయనకుగల హక్కులు, ఆయన మరణము, ఆయన చనిపోయి, తిరిగి సజీవుడగుట, అన్నియు సాటిలేనివి.

యేసుప్రభువుయొక్క హక్కులు చూచితిమి. ఆయనకు మరొక హక్కు గలదు. నీ జీవితముపై ఆయనకు హక్కు గలదు. "నా కుమారుడా, నీ హృదయము నాకిమ్ము" అని ఆయన అడుగుచున్నాడు. అది ఆయన హక్కు. నీహృదయ మాయనకు అర్పించుట నీ భాగ్యము, లేనిచో శిక్షకు పాత్రుడవగుదువు (మార్కు 16:16).

—T. జ్ఞానానందము, కాకినాడ-2.

---

సంక్షిప్త ప్రసంగము :

## మనం యేసు అడుగు జాడల్లో నడవాలి

## *( We should Follow His Steps )*

పరిచయము :

1. 1 పేతురు 2:21.
2. ఆయనను వెంబడించడానికి మానవుడు సమస్తాన్ని విసర్జించాలి (మత్తయి 16:24; యిర్మి 10:23; సామె 16:9).

అవిధేయతలో ఆయన్ను వెంబడించలేము :

1. యోహాను 2:5; హెబ్రీ 5:8, 9.
2. రోమా 6:17; మత్తయి 7:24.

వెనుకకు తిరిగి చూస్తూ యుండ కూడదు :

1. లూకా 9:62.
2. ఇశ్రాయేలీయులు వెనుకకు చూచారు. నిర్గమ 16:3; యోహాను 6:68; ఫిలిప్పీ 3:14.

మనం యేసువైపు చూడాలి :

1. హెబ్రీ 12:2.
2. ఒక నాయకుని వెంబడించాలంటే మన దృష్టి ఆ నాయకుని మీదే ఉంచాలి. యోహాను 8:12; మత్తయి 4:19.

మనం ముందుకు సాగిపోవాలి :

1. నిర్గమ 14:15; యిర్మియా 7:24.

2. మత్తయి 26:39; లూకా 6:12.

3. సంఘం కదలాలంటే — ముందుకు పోవాలి, అభివృద్ధి జెందాలి, విశ్వాసంతో వెంబడించాలి :

1. 2 కొరింథీ 5:7; రోమా 10:17.

2. మత్తయి 4:4; 8:8.

యేసు తన వాక్యంద్వారా నడిపిస్తాడు :

1. కీర్తన 119:105.

2. ఆయన వాక్యం మానవకల్పిత సంఘాలలోనికి నడిపించదు.

3. ఆయన వాక్యం రక్షణలోనికి, తన సంఘంలోనికి నడిపిస్తాది (అపొ. కా. 2:41, 47).

—జాన్ హేరిస్.

## ఏమి వెదకు చున్నావు ?
## దేవుని నీతినా ? స్వనీతినా ?

వెదకుట అనుమాట చాల ప్రాముఖ్యమైనది. చాలమంది భాగ్య, భోగములను వెదకుచున్నారు. యూదులు సూచక క్రియలు చేయమనుచున్నారు. గ్రీకులు జ్ఞానమును వెదకుచున్నారు (1 కొరింథీ 1:22). క్రీస్తు అయితే, ఆయన రాజ్యమును, నీతిని వెదకమను చున్నాడు. ఈనాటి అగ్రదేశములు భూలోకమును కన్ను రెప్పపాటులో నాశనముచేయు ఆయుధములను వెదకుచున్నవి. మరియదైతే నా ప్రభువును ఎవరో ఎత్తుకొని పోయిరని యేడ్చుచు ప్రభువును వెదకుచున్నది. క్రైస్తవుడా, నీవైతే దేనిని వెదకుచున్నావు? దేవుని నీతినా ! స్వనీతినా ? స్వనీతిని ఆధారము చేసుకుంటే, చేరవు పరలోకము.

సకల దుర్నీతితో నడుచువారు సహితము, తమ బిడ్డలు నీతిగా నడచుకొనవలెనని ఉపదేశింతురు. నీతి కలిగినవాడు దేవుని పోలిక కలిగి

యున్నాడు (ఎఫెసీ 4:23, 24). క్రీస్తు విద్యార్థుల యొక్క ప్రత్యేక లక్షణము ఇది. ఎవరు గొప్ప? అను ప్రశ్న శిష్యులలో చెలరేగినపుడు, క్రీస్తు శిష్యుల పాదములు కడిగి, మీలో గొప్పవాడు కాగోరినచో పరిచారము చేయవలెనని చెప్పి క్రియను చేసి చూపినాడు. విందులలో అగ్రస్థానములు కాదు, ఆఖరిస్థాన మలంకరించ వలెననియు, తన్ను తాను తగ్గించుకొనవలెననియు, క్రీస్తు తన నీతిని బోధించినాడు. తన్ను హింసించు వారికొరకు, తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు, వీరిని క్షమించుమని తండ్రిని వేడెను. యేసు తన ప్రార్థనయందు నీతిస్వరూపుడవగు తండ్రీ యని, తండ్రిని సంబోధించినాడు (యోహా 17:25). తండ్రి నీతిని బాగడుచున్నాడు. తన నీతిని కనుపర్చుచున్నాడు. హృదయములను, అంతరింద్రియములను పరిశీలించు నీతిగల దేవా! (కీర్త 7 : 9) అని దావీదు పల్కుచున్నాడు. నీతిని, భక్తిని, విశ్వాసమును, ప్రేమను, ఓర్పును, సాత్వికమును సంపాదించుటకు ప్రయాస పడుమని (1 తిమొ 6 : 11) పౌలు తిమోతికి చెప్పుచున్నాడు. నీతి కిరీట ముంచబడినదనియు, నీతిగల న్యాయాధిపతి అనియు, ప్రభువును సంబోధిస్తూ అది నాకుమాత్రము కాదు, తన ప్రత్యక్షత నపేక్షించువారందరికి అనుగ్రహించుననెను.

గాన సోదరుడా, నీతి మానవులందరికి ప్రధానమని ప్రభువు ఉపదేశించుచున్నాడు. నీతిగల కుటుంబములో తగవులుండవు. కోపోద్రేకములుండవు. సమస్యలుండవు. నీతిగల సంఘములో పోరాటములుండవు. పౌరుషము లుండవు. పార్టీ లుండవు. విభజన లుండవు. శాస్త్రుల నీతికంటెను, పరిసయ్యుల నీతికంటెను మననీతి అధికము కావలెనని ప్రభు కోరుచున్నాడు.

ఇది ఇట్లుండగా స్వనీతిపరులు చాలమంది యున్నారు. ధర్మము చేయునపుడు తమముందు బూర నూదించుకొనువారు చాలమంది గలరు. సంతవీధులలో సంధ్యావందనములు కోరువారును, నడివీధు

లలో ప్రార్థనలు ప్రజలు చూచునట్లుగా చేయువారును గలరు. యాజ్ఞి
లని తెలియునట్లు, తమనొసట బోర్డులు కట్టుకొనువారును గలరు
స్వనీతి కార్యములతో దేవుని తృప్తిపర్చలేము. దేవుని నీతిని ఎవడు
జరిగించునో వాడు దేవుని మూలముగా పుట్టినవాడు (1 యోహాను
2:29). దేవుని మూలముగా పుట్టవలెనంటే అది బాప్తిస్మముద్వారా
సాధ్యమగును. అపో. కా. 10:1-8 వరకు చదివినచో కొర్నేలి యొక్క
భక్తి ధర్మము, ప్రార్థన ఎంతగొప్పవో తెలియునగును. అయినను
అతని కొరకు లోటు యున్నదనియు, ఆలోటును సీమోను పేతురును
రప్పించుకొని, పూర్తి చేయించుకోమని దేవదూతద్వారా తెలియపర్చ
బడెను. దేవుని మాటకు విధేయుడై సీమోను పేతురును పిలువ
నంపించికొర్నేలి బాప్తిస్మము పొందెను. పేతురు బోధవిని, కొర్నేలి
ఆయన రాజ్యమును నీతిని వెదకినాడు. యేసుక్రీస్తు నామము
బాప్తిస్మము పొందాడు (అపో. కా. 10:48). సోదరుడా! కొర్నేలి
స్వనీతి రక్షణ నివ్వలేకపోయినది. దేవుని నీతికి విధేయుడవు కమ్ము
నీవేమి వెదకుచున్నావు?

—ఎ. ఇశ్రాయేలురాజు, కాకినాడ.

---

## లేఖనార్థమైన భాష
## *(Scriptural Language)*

మనం మాట్లాడితే దైవోక్తులు మాట్లాడినట్లు మాట్లాడాల
అపో. పేతురు చెప్పాడు (1 పేతురు 4:11). బైబిలు మాట్లాడుచోట
మేము మాట్లాడుదుము, బైబిలు మౌనియైనచోట మేము మౌన
మగుదుమని మనం తరుచు చెబుతాం. అది మంచిది. మిగిలినవా
గాక మనముకూడ దీన్ని అనుసరించాలి.

సంఘము, దాని నామము, సంఘ పాలనపద్ధతి, దాని ఆరాధ

మొదలగు వాటిలో మనం బైబిలు బోధనే అనుసరించుచుండవచ్చును. అయితే మతశాఖల మిత్రులు వాడే పదజాలాన్ని మనం ఆలోచించ కుండా వాడేసే ప్రమాదం ఉంది. అవి లేఖనార్ధమైన మాటలు కాదు గనుక మనం జాగ్రత్తపడాలి.

ఉదాహరణకు: కొందరు గుడికివెళ్తున్నాం అని చెబుతారు. మనం గుడికి వెళ్ళం గాని ఆరాధనకు వెళ్తాం. మన ఆరాధన స్థలమే సంఘమని అభిప్రాయం ఉండడమువల్ల గుడినిగూర్చి కొందరు చెబుతూ యుంటారు. మనం ఆరాధనకు కూడుకొనే స్థలం లేక మందిరం సంఘముకాదు. రక్షింపబడినవారే సంఘము. సంఘములో రక్షింప బడినవారుంటారు (అపొ.కా. 2:47). శరీరమునకు లేక సంఘమునకు రక్షకుడు క్రీస్తని ఎఫెసీ 5:23 చెప్పుచున్నది.

నా సంఘము, మా సంఘము అని కొంతమంది మాట్లాడు తారు. నిజానికి సంఘము నాది, నీది, మాది కాదు, అది క్రీస్తుది. నా సంఘమును కట్టుదునని యేసుప్రభువు చెప్పాడు (మత్త 16:18). సంఘాన్ని కొనడానికి, లేక సంపాదించడానికి క్రీస్తు తన స్వరక్త మిచ్చాడని అపొ.కా. 20:28లో పౌలు చెప్పాడు. గనుక మా సంఘము, క్రీస్తు సంఘము అను మాటల్లో గొప్ప భేదమున్నది. అది మనదయితే క్రీస్తుదికాదు. అది క్రీస్తు సంఘమయితే మానవులది కాదు. ప్రభువు సంఘము ఒక డినామినేషన్ కాదు. గనుక శాఖలతో దానికి పొత్తులేదు. మానవకల్పిత భావనుండి బోధనుండి సంఘము పవిత్రముగా యుండాలి. తద్వారా అది ప్రభువు సంఘమౌతాది.

మరల, ఆయా స్థానిక సంఘాల్లోయున్న బోధకులను పాస్టరు అని కొందరు పిలుస్తూ యుంటారు. ఆ బోధకులుకూడ పాస్టరని పిలి పించుకొంటారు. ఇంగ్లీషు భాషలో పాస్టరు అను పదము సంఘపెద్ద, కాపరిని సూచిస్తున్నది. క్రొత్తనిబంధన సంఘాల్లో ఒకే ఒక్క కాపరి (Pastor) ఎన్నడు లేదు. ప్రతి స్థానిక సంఘములోను ఒకరికంటె

ఎక్కువమంది పెద్దలు నియమించబడినట్లు మన మెరుగుదుము. ఎల్డర్, పాస్టర్, ప్రెస్బిటర్, ఓవర్‌సీర్ అను ఇంగ్లీషు పదాలు ఒకే ఒక్క పద విని సూచిస్తూ బైబిలులో వాడబడినవి. స్థానిక సంఘ బోధకుని (సంఘ పెద్దలలో ఒకడు కానప్పుడు) పాస్టర్ అని పిలువబడుట లేఖ నార్థమైనది కాదు. బోధకుని పాస్టర్ అని పిలిచే మతశాఖల అలవాటు క్రీస్తు సంఘాలలోనికి దొర్లుకుంటు వచ్చేసింది. దాన్ని మనం తప్పక అరికట్టాలి. సంఘపెద్దల కుండవలసిన అర్హతలు 1 తిమోతి 3వ అధ్యాయములోను, తీతు పత్రిక మొదటి అధ్యాయములోను మనం కను గొనగలం.

కనుక క్రీస్తుకు ఆయన సంఘానికి చెందిన వారంతా తాము సంఘాన్ని గూర్చి, ఆరాధనను గూర్చి, బోధకులను గూర్చి ఇంకా మొదలగు అట్టి సంగతులను గూర్చి మాట్లాడేటప్పుడు లేఖనార్థమైన రీతిలో మాట్లాడుటకు జాగ్రత్తపడాలని ప్రోత్సహించుదాం. సత్యాన్ని బోధించువారు సత్యవాక్య ప్రకారమే మాట్లాడాలి.

—ఛోట్ & జాషువా

---

## పడిపోనివారెవరు?

## *( Who Can't Fall ? )*

అపొ. పౌలు దైవావేశము కలిగినవాడే అయినను, దేవుని కృప నుండి తాను పడిపోవుట సాధ్యమేనని గ్రహించాడు. అతడిట్లు వ్రాశాడు: "ఒకవేళ ఇతరులకు ప్రకటించిన తరువాత నేనే భ్రష్టుడనై పోదునేమో అని నా శరీరమును నలగగొట్టి, దానిని లోబరచు కొనుచున్నాను" (1 కొరింథీ 9 : 27). మరల, "తాను నిలుచున్నా నని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొన వలెనని" అతడు హెచ్చరించాడు (1 కొరింథీ 10:12).

క్రైస్తవులు తమ ప్రవర్తనలో జాగ్రత్తగా లేకపోతే వారు దేవుని నుండి తొలగిపోయే ప్రమాద మున్నదని హెబ్రీపత్రిక లేఖకుడు నమ్మాడు. అందువలన "సహోదరులారా, జీవముగల దేవుని విడిచిపోవునట్టి విశ్వాసములేని దుష్ట హృదయము మీలో ఎవనియందైనను ఒక వేళ ఉండునేమో అని జాగ్రత్తగా చూచుకొనుడి" యని హెచ్చరిస్తూ వ్రాసాడు (హెబ్రీ 3:12).

క్రీస్తునందలి విశ్వాసక్రమమును వీడి వేరొక దానికి పోవువారు కృపనుండి తొలగిపోతారు. "మీలో (మోషే) ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడువారెవరో వారు క్రీస్తులో నుండి బొత్తిగా వేరుచేయబడి యున్నారు, కృపలో నుండి తొలగిపోయి యున్నారు" (గలతీ 5:4).

దేవునితో మనం నడుస్తూ యుంటామనే షరతుపై దేవునితో మన సహవాసము ఆధారపడి యున్నది. క్రైస్తవులకు యోహాను ఇట్లు వ్రాసాడు: "అయితే ఆయన వెలుగులో నున్న ప్రకారము మనము వెలుగులో నడిచిన యెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7). దేవుని వాక్యాన్ని అనుసరించడం మానివేసిన వాడు కృప నుండి తొలగిపోతాడు.

—జీన్ ఓవర్టన్.

## నీపేరు పరలోకమందు వ్రాయబడినదా ?

### *(Is Your Name Written in Heaven ?)*

లూకా సువార్త 10 : 17-20 లో మనం ఇట్లు చదువగలం : "ఆ డెబ్బదిమంది శిష్యులు సంతోషముతో తిరిగి వచ్చి-ప్రభువా,

దయ్యములు కూడ నీనామమువలన మాకు లోబడుచున్నవని చెప్పగా, ఆయన-సాతాను మెరుపువలె ఆకాశము నుండి పడుట చూచితిని. ఇదిగో పాములను, తేళ్ళను త్రొక్కుటకును, శత్రువు బల మంతటి మీదను మీకు అధికారము అనుగ్రహించి యున్నాను; ఏదియు మీ కెంతమాత్రమును హాని చేయదు. అయినను, దయ్యములు మీకు లోబడుచున్నవని సంతోషింపక మీ పేరులు పరలోకమందు వ్రాయబడియున్నవని సంతోషించుడని వారితో చెప్పెను."

పాములు, తేళ్ళమీద వారికి శక్తి నిచ్చినందుకు గాక, వారి పేరులు పరలోకమందు వ్రాయబడి యున్నందుకు సంతోషించాలని యేసు తన శిష్యులకు చెప్పాడు. ఆ 70 మంది శిష్యుల కియ్యబడిన అద్భుత శక్తి మనకుకూడ ఇయ్యబడితే మనము వారి వలెనే సంతోషించి యుందుము. పరలోక నిత్య సంతోషంకంటే ఈ లోకానందం కొరకు వెదకుట మనందరికీ ఎంతో అలవాటై పోయింది. యేసు ప్రభువు చెప్పిన దానికంటే ప్రాముఖ్యమైన ప్రశ్న మరొకటి మన కేదీ లేదు. నీ పేరు పరలోకమందు వ్రాయబడినదా? యేసు శిష్యులకున్న నిరీక్షణ నీకున్నదా?

దేవుడు ఒక రికార్డును లిఖించి యుంచుతున్నాడనే దాన్ని మనం ప్రశ్నింపలేము. మోషే దాన్నిగూర్చి చెప్పాడు. "ఎవడు నా యెదుట పాపము చేసెనో వాని నా గ్రంథములో నుండి తుడిచి వేయుదును" యెహోవా దేవుడు మోషేతో చెప్పాడు (నిర్గమ 32:31-33). అపొస్తలుడైన పౌలుకూడ దాన్ని గూర్చి చెప్పాడు. ప్రభువు పనిలో సహాయపడిన "ఆ సహకారుల పేరులు జీవగ్రంథ మందు వ్రాయబడి యున్నవని" అతడు చెప్పాడు (ఫిలిప్పీ 4:3). ప్రకటన గ్రంథంలో యేసు దాన్ని గూర్చి పలుమార్లు చెప్పాడు.

మన పేరులు ఏ షరతుల మీద పరలోకమందు వ్రాయబడగల్గునట్లు చేసికొనగలము? ఎవరు దేవుని చిత్తాన్ని జరిగిస్తారో, వారే

పరలోకంలో ప్రవేశిస్తారని యేసు ప్రభువు చెప్పాడు (మత్త 7:21). అపొస్తలుడైన యోహానుకూడ అదేసంగతిని చెప్పాడు. దేవుని చిత్తాన్ని జరిగించువాడు నిరంతరము నిలుచునని అతడు చెప్పాడు (1 యోహాను 2:15-17). గనుక దేవుడు మన పేరులను పరలోక మందు వ్రాయడానికి ముందు మనం దేవుని చిత్తం జరిగించాలని యెరుగుదుము. ఆయనకు విధేయులైన వారికే రక్షణ యున్నదని లేఖనములు బోధించుచున్నవి (హెబ్రీ 5:8-10) ఆయనకు విధేయులు కానివారికి ఆయన ప్రతిదండన చేయును (2థెస్స 1:7-9).

గనుక మనం ప్రభువు చిత్తానికి లోబడుటకు జాగ్రత్త పడు దముగాక. నీ పూర్ణ హృదయంతో ఆయనయందు విశ్వాసముం చుము, నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము, క్రీస్తే ప్రభువని దేవుని కుమారుడని ఒప్పుకొనుము, నీ పాపక్షమాపణ నిమి త్తము బాప్తిస్మము పొందుము. అప్పుడు నీ పాపములు క్షమింపబడి యున్నవనీ, నీ పేరు గొర్రెపిల్ల జీవగ్రంథంలో వ్రాయబడి యున్నదనీ ఆయన యిచ్చిన నిర్ధారణ, ఆనందం నీకుంటాది. ★

## నిన్ను ఎన్నడు విడువను
## *( I'll never Forsake Thee )*

హెబ్రీ 13:5లో యేసు "నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడు ఎడబాయను" అని చెప్పాడు. క్రైస్తవులు ముందుకు సాగి పోడానికి ఈ మాటలు ప్రోత్సాహం కల్పించాలి. క్రీస్తు అనుచరులకు కష్టకాలము తప్పక వచ్చును. అయితే నీవు నిస్పృహ జెందవద్దు. ఆయన నీకు తప్పక సహాయం చేస్తాడు.

మనం ప్రభువు చిత్త ప్రకారము ఆయనను ఆరాధిస్తే ఆరా ధనలో ఆయన మనల్ని విడువడు. "ఏలయనగా ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందునని" ఆయన చెప్పాడు (మత్తయి 18:20).

సిలువ ధ్వజము నెత్తుకొని ప్రభువు రాజ్యాభివృద్ధి కొరకు పోరాడు సైనికుని ఎవనినీ ఆయన విడువడు. క్లిష్టమైన ప్రదేశంలో, కొరింథులో యుండి పనిచేయుచున్న పౌలుతో ఆయన, "నేను నీకు తోడై యున్నాను. నీకు హానిచేయుటకు నీమీదికి ఎవడును రాడు" అని చెప్పాడు (అపొ. కా. 18:10).

ప్రభువు బీదలను, భాగ్యవంతులు కానివారిని విడువడు. బైబిలు ఇట్లు చెప్పుచున్నది: "ధనాపేక్ష లేనివారై మీకు కలిగిన వాటితో తృప్తిపొంది యుండుడి. నిన్ను ఏమాత్రము విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను అని ఆయనయే చెప్పెనుగదా. కాబట్టి ప్రభువు నాకు సహాయుడు, నేను భయపడను, నరమాత్రుడు నాకేమి చేయగలడు! అని మంచి ధైర్యముతో చెప్పగలవారమై యున్నాము" (హెబ్రీ 13 : 5, 6).

—రిచర్డ్ బోసర్.

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
**SATYA WAKKU**
P.O. Box. 80
KAKINADA–533 001

**To**

..............................................
..............................................
..............................................
..............................................